సాక్షి
ప్రకాశం
బుధవారం । 17 । జూలై । 2024



భూసేకరణ వేగంగా పూర్తిచేయాలి

జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. - 8లో..



ఉద్యోగుల తొలగింపు సరైంది కాదు

అధికార పార్టీ నాయకుల మెప్పు పొందేందుకు తాత్కాలిక ఉద్యోగులపై అధికారులు ఒత్తిడి చేసి తొలగించడం సరికాదని ఎమ్మెల్యే చంద్రశేఖర్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

హెల్మెట్ ధరించడం బాధ్యత

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి



అవగాహన ర్యాలీలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: హెల్మెట్ ధరించడం బరువు కాదని, మన బాధ్యతగా ప్రతి ఒక్క వాహనదారుడు భావించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి అన్నారు. స్థానిక జిల్లా న్యాయస్థానాల ప్రాంగణం నుంచి హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పించే ర్యాలీ కార్యక్రమాన్ని మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాహన ప్రమాదాలతో కుటుంబాలు, దేశం ఎంతో ఆర్థిక భారాన్ని వహించాల్సి వస్తుందన్నారు. కుటుంబ వ్యవస్థకు మూలాధారమైన వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో గాయపడడం లేదా మరణించి ఆ కుటుంబాలు తీవ్ర మనోవేదనతోపాటు ఆర్థికంగా కంగుబాటుకు గురవుతాయన్నారు. మోటారు వాహనాల చట్టం సెక్షన్ 129 కింద నేరమని, 194(డి) ప్రకారం శిక్షలు విధిస్తారని, ప్రతి ఒక్క వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.అమ్మన్నరాజా మాట్లాడుతూ మొబైల్ ఫోన్ కొన్న ప్రతి వినియోగదారుడు ఏ విధంగా స్క్రీన్ గార్డుతో అందంగా అలంకరించుకుంటాడో అదే విధంగా ప్రతి ఒక్క వాహనదారుడు వాహనం కొనగానే బాధ్యతగా హెల్మెట్ కొని ధరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, ఒంగోలు పట్టణ డీఎస్పీ కిషోర్‌బాబు, ట్రాఫిక్ సీఐ మాలకొండయ్య, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ జిల్లా న్యాయస్థానాల ప్రాంగణం నుంచి చర్చిసెంటర్ వరకు కొనసాగింది.

తీరంలో సోనా విధ్వంసం

తమిళనాడు జాలర్లు బరితెగించారు. అక్రమంగా తీరంలోకి జొరబడి సోనాబోట్లతో విధ్వంసం సృష్టిస్తున్నారు. దశాబ్దాలుగా జిల్లాలోని మత్స్యకారులపై యుద్ధకాండ సాగిస్తున్నారు. మారణాయుధాలతో దాడులకు తెగబడుతున్నారు. వలలను ధ్వంసం చేస్తున్నారు. విలువైన మత్స్య సంపద దోచుకుపోతున్నారు. మొన్నటి వరకూ 20, 30 వచ్చే బోట్లు నేడు రెట్టింపయ్యాయి. వీరి ఆగడాలతో స్థానిక జాలర్లు వేటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. వేటసాగక ఇబ్బందులు పడుతున్న వీరికి తమిళ జాలర్ల ఆగడాలు శాపంగా మారాయి.

- బరితెగిస్తున్న తమిళ జాలర్లు
- నిబంధనలు అతిక్రమించి.. తీరంలోకి జొరబడి
- విలువైన మత్స్య సంపద దోపిడీ
- మారణాయుధాలతో భౌతిక దాడులు
- ఆర్థికంగా నష్టపోతున్న మత్స్యకారులు
- సోమ, మంగళవారాల్లో తీరానికి 50 నుంచి 80 వరకూ సోనా బోట్లు



పాకల తీరంలో వేటాడుతున్న సోనాబోట్లు, వలలను కాపాడుకుంటున్న మత్స్యకారుడు

సింగరాయకొండ: తమిళనాడు రాష్ట్రం కడలూరు బీచ్ నుంచి రాష్ట్రంలోని కొత్తపట్నం బీచ్ వరకు సుమారు 150 నాటికల్ మైళ్ల దూరం ఉంది. తిరుపతి జిల్లాలోని వాకాడు ప్రాంతంలో గోవిందరావు పట్టపుపాలెం, నెల్లూరు జిల్లాలోని మైపాడు, ఇస్కపల్లి పట్టపుపాలెం, రామాయపట్నం, చాకిచర్ల పట్టపుపాలెం, జిల్లాలోని ఊళ్లపాలెం, పాకల పట్టపుపాలెం, టంగుటూరు మండలం తాళ్లపాలెం, కొత్తపట్నం బీచ్, మడనూరు ప్రాంతాల్లో మత్స్యకార పాలెంలు ఉన్నాయి. వేలాది మంది మత్స్యకారులు వేటే ఆధారంగా జీవిస్తున్నారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు అక్రమంగా జొరబడి విలువైన మత్స్య సంపదను దోచుకుపోతున్నారు. అంతేకాకుండా స్థానిక మత్స్యకారులపై దాడులకు తెగబడుతున్నారు. పడవలను, వలలను ధ్వంసం చేస్తున్నారు. దశాబ్దాలుగా నడిసంద్రంలో ఇవి నిత్యకృత్యంగా మారాయి. సోమ, మంగళవారాల్లో కూడా 50 నుంచి 80 వరకు సోనాబోట్లు తీరానికి దగ్గరగా రావడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీర ప్రాంత నిబంధనలు ఇలా..

సముద్ర తీరప్రాంత నిబంధనల ప్రకారం మోటారు లేని బోట్లు తీరానికి 2 కిలోమీటర్లు, మెకనైజ్డ్ బోట్లు తీరానికి 8 కిలోమీటర్లు, సోనాబోట్లు తీరానికి 8 కిలోమీటర్ల పైన మాత్రమే చేపల వేట సాగించాలి. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. సాధారణంగా చేపపిల్లలు తీరం సమీపంలోనే పెరుగుతాయి. అందువల్ల వాటికి నష్టం వాటిల్లకుండా వేటసాగించేలా ప్రభుత్వాలు నిబంధనలు విధించాయి. అయితే తమిళనాడు జాలర్ల నిబంధనలు తుంగలోకి తొక్కుతున్నారు. పెద్దబోట్లతో వచ్చి మత్స్య సంపద వృద్ధికి విఘాతం కలిగిస్తున్నారు.

సోనా బోట్లతో విధ్వంసం

తమిళనాడుకు చెందిన జాలర్లు నిబంధనలు అతిక్రమించి గుంపులు, గుంపులుగా తీరానికి చేరువగా వచ్చి మెకనైజ్డ్ బోట్లతో వేటసాగిస్తున్నారు. గతంలో 20 నుంచి 30 వరకు సోనాబోట్లు వచ్చేవి. ఇటీవల కాలంలో 50 నుంచి 80 వరకు బోట్లు తీరంలోకి జొరబడుతున్నాయి. వీటి కారణంగా స్థానిక మత్స్యకారులకు చెందిన లక్షలాది రూపాయల వలలు తెగిపోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. వాస్తవానికి సోనాబోట్లు సముద్ర తీరప్రాంత నిబంధనల ప్రకారం తీరానికి 8 నాటికల్ మైళ్లు దాటిన తరువాత మాత్రమే చేపల వేట సాగించాలి. ఈలోపు వేట సాగిస్తే చట్టప్రకారం నేరం. తమిళనాడు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటే నిబంధనలు అతిక్రమించిన వారికి భారీ జరిమానా విధించటంతో పాటు వారి లైసెన్స్‌లు కూడా రద్దవుతాయి. కానీ ఇవేవీ జరగటం లేదు. మెకనైజ్డ్ బోట్లు వేటాడాల్సిన ప్రాంతంలో సోనాబోట్లు వేట సాగిస్తుండడంతో మత్స్య సంపద లభించక ఆర్థికంగా నష్టపోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇదే తంతు జరుగుతోందని వాపోతున్నారు. జిల్లాలో సుమారు 1,300 మెకనైజ్డ్ బోట్లు, 700 మోటారు లేని బోట్లు ఉన్నాయి.

ఇరు రాష్ట్రాల మధ్య సమావేశాలకు యత్నాలు

సముద్రతీర ప్రాంత నిబంధనలు అతిక్రమించి చేపల వేట సాగిస్తున్న కడలూరు బోట్లను శాశ్వతంగా అడ్డుకుని సమస్య పరిష్కారానికి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ప్రయత్నించాయి. మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019, 2021లో రెండుసార్లు ప్రయత్నించింది. కరోనా కారణంగా సమావేశాలు రద్దయ్యాయి. జిల్లాలో సోనాబోట్ల చొరబాట్లను అడ్డుకునేందుకు ప్రభుత్వం లీజు పద్ధతిలో స్పీడ్‌బోటును గత సంవత్సరం నవంబర్‌లో ఏర్పాటు చేసింది. ఈ బోటు సాయంతో మత్స్యశాఖ, మెరైన్ అధికారులు కలసి ఒకటి రెండు సార్లు సోనాబోట్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. లీజు కాలం ముగియటం తరువాత ఎన్నికల కోడ్ రావటంతో సోనాబోట్ల గురించి అధికారులు చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని తమిళ జాలర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు.

రూ.లక్ష విలువైన వలలు నష్టపోయా



సోనాబోట్ల కారణంగా గత సంవత్సరం లక్ష రూపాయల విలువైన వలలు నష్టపోయాను. దీనికి తోడు సోమవారం వేటకు వెళితే 300 కేజీల రొయ్యలు పడ్డాయి. వాటిని కేజీ రూ.100 చొప్పున అమ్మాను. ఒక్కరోజు రూ.30 వేల ఆదాయం వచ్చింది. వేట నిషేధం తరువాత నిన్న ఒక్కరోజే వేట బాగుంది. కానీ మంగళవారం సోనాబోట్లు వచ్చి వేటాడాయి. దీంతో వేటకు వెళితే కేవలం ఒక కేజీ రొయ్యలు మాత్రమే వలలకు చిక్కాయి. ఈ విధంగా సోనాబోట్ల కారణంగా ఆర్థికంగా నష్టపోతున్నాను. వీటిని నియంత్రించాలి.

– వాయిల రామకృష్ణ, మత్స్యకారుడు, పాకల

సోనాబోట్లను నియంత్రించాలి



సోనా బోట్ల కారణంగా సంవత్సర కాలంగా చేపల వేట బాగా లేదు. నిబంధనలు అతిక్రమించి సోనాబోట్లు చేపల వేట చేయడం వలన మత్స్య సంపద లభించటం లేదు. అంతేకాక వేలాది రూపాయల వలలు నష్టపోతున్నాం. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– కన్నా సుబ్బారావు, ఊళ్లపాలెం

పెరుగుతున్న భౌతిక దాడులు

గత సంవత్సరం తిరుపతి, నెల్లూరు జిల్లాలోని మత్స్యకార గ్రామాల తీరప్రాంతాల్లో కడలూరు మత్స్యకారులు భౌతిక దాడులకు తెగబడ్డారు. ఇటీవల నెల్లూరు జిల్లా కావలి మండలం ఇస్కపల్లి మత్స్యకారులు కడలూరు బోట్లతో దాడులకు పాల్పడగా ఇద్దరు ఇస్కపల్లి మత్స్యకారులకు గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా జిల్లాలోని పాకల, కొత్తపట్నం మత్స్యశాఖ అధికారుల అండదండలతో కడలూరు బోట్లపై దాడులకు దిగి వారిని తరిమికొట్టారు. తమిళ జాలర్ల ఆగడాలతో కంటిమీద కునుకు కరువైందని స్థానికులు వాపోతున్నారు.

కెనాల్స్, చెరువుల మరమ్మతులు చేయండి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో చేపట్టిన ఇరిగేషన్ కెనాల్స్, చెరువుల ఆధునికీకరణ, మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని, సాగు, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టులు, వాటిలో నీటి లభ్యత, మరమ్మతులు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన ఇరిగేషన్ పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. దీనిలో ఇరిగేషన్ ఎస్ఈ మురళీకృష్ణ, ఎస్ఈ అబుత్‌అలీం పాల్గొన్నారు.

ఏపీ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ వర్కర్స్ కమిటీ అధ్యక్షునిగా ఖాదర్‌వలి

ఒంగోలు: ఏపీ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ వర్కర్స్ కమిటీ జిల్లా అధ్యక్షునిగా ఖాదర్‌వలి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే అక్బర్ బాషాతోపాటు పదిమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఏపీ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ, రాష్ట్ర కార్యదర్శి షేక్ మీర్జాబాబుల ఆదేశాలమేరకు జిల్లా, నగర కమిటీ ఎంపిక మంగళవారం స్థానిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ రఫీ అహ్మద్ కార్యాలయంలో నిర్వహించారు. మరో 12 మందికి సభ్యత్వాన్ని ఇచ్చారు.

ఆరోపణల నిరూపణకు ఎందుకు వెనకాడుతున్నారు

- హవాలా, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్ రెడ్డి అంశాలపై ఎందుకు మౌనం వహిస్తున్నారు
- భూకబ్జా అంశాలపై సీఎం, డిప్యూటీ సీఎంలనే విచారణ చేయాలని కోరుతున్నా
- దామచర్ల వ్యాఖ్యలపై మీడియా సమావేశంలో బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ''సంప్రదాయం కలిగిన కుటుంబం నుంచి వచ్చాం...వాడు వీడు అనే తత్వం మాది కాదు. కొవ్వు పట్టింది నాకు కాదు...అధికార మదంతో మాట్లాడడం కాదు...చేతనైతే ప్రజాభిమానం సంపాదించుకో. లేదంటే నీకు కొవ్వు ఎంత ఉందో చెప్పు..దించుతా'' అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తనపై చేసిన వ్యాఖ్యలపై మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కౌంటర్ ఎటాక్ ఇచ్చారు. మంగళవారం ఉదయం తన నివాసంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హవాలా, పెద్దిరెడ్డి భూకబ్జా అంశాలపై విచారణకు జనార్దన్ ఎందుకు ముందుకు రాలేదో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. నాపై మీరు చేసిన భూకబ్జా ఆరోపణలపై ఇప్పటికే వ్యవస్థలను మేనేజ్ చేసే వ్యక్తులను కాకుండా నిష్పక్షపాతంగా విచారణకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులనే తాను కోరానన్న విషయం మరువరాదన్నారు. బ్యాంకులకు సంబంధించిన అప్పుల విషయంలో వ్యక్తిగతం అని చెప్పేటప్పుడు ఇతరులకు సంబంధించినవి వ్యక్తిగత అంశాలనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. మా వియ్యంకుని భూమిలో 24 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంటే దానిని స్పష్టంగా లేఅవుట్‌లో చూపించి వదిలేశామన్నారు. అదే రాజుపాలెంలో ఉన్న మీ రొయ్యల చెరువుల భూముల్లో ఎంత డీకే ఉందో నిరూపించమంటారా అంటూ సవాల్ విసిరారు. అధికారంలో ఉన్నప్పుడే ఏమీ చేయలేకపోయారని వ్యాఖ్యానించడం అవివేకానికి నిదర్శనమని, ఒకరిని టార్గెట్ చేయాలనే ఉద్దేశం తనకు లేకపోవడమే అందుకు కారణమన్నారు. మంచితనానికి తాను లొంగుతానని, అంతే తప్ప బెదిరిస్తే లొంగే రకమే కాదన్నారు. ప్రెస్‌మీట్‌లో చొక్కా విప్పి దౌర్జన్యం చేస్తానని గుప్తా అంటుంటే పోలీసుశాఖ ఏం చేస్తోంది..చేష్టలుడిగి చూస్తుందా అంటూ ప్రశ్నించారు. నా కోడలు చెప్పుతో కొట్టిందంటూ తప్పుడు కేసులు పెట్టించాలని పోలీసులపై ఒత్తిడి తీసుకురావడమా సంస్కారం అంటూ నిలదీశారు. తాను రాజకీయాల నుంచి విరమించుకోవాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో ఉంటే పారిపోయానని వ్యాఖ్యానించడం కరెక్టా? అయితే తమరు రెండు సంవత్సరాల పాటు 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత అడ్రస్ లేకుండా వెళ్లావు కదా దాని సంగతి ఏంటి అంటూ ప్రశ్నించారు. చివరకు కరోనా సమయంలో కార్యకర్తలు, నాయకులకు సైతం అండగా ఉండలేని మీరు మా గురించి విమర్శించడానికి సిగ్గుండాలన్నారు. వేలకోట్లు దోచేశానని, హవాలా అని చేసిన ప్రచారం నిరూపించేందుకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. నగరంలో అపార్టుమెంట్లు కట్టేవారికి, లేఅవుట్లు వేసేవారికి 95 మందికి నోటీసులు ఇచ్చినట్లు ఆయనే ఒప్పుకున్నారని, దాని వెనుక ఎవరెవరిని ఎంత డిమాండ్ చేసింది కూడా త్వరలోనే బయటపెడతా అన్నారు. తానైతే ఏ వ్యాపారిని ఇబ్బంది పెట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రజలు కూడా తెలుసుకోవాలని, నేను పట్టుబట్టి ఇళ్ల పట్టాలు ఇప్పిస్తే వాటిని దొంగ పట్టాలని టీడీపీవాళ్లు మాట్లాడారు... ఇప్పుడు అవి దొంగ పట్టాలని నిరూపించాలన్నారు. ఇప్పుడేమో వాటిని మార్చి కుదించేలా చేస్తానని చెబుతున్నారని వాటిని ఏం చేస్తారో వారిష్టం అన్నారు. మరో వైపు భూమి కొనుగోలులో అవినీతి అన్నారు ... ఒక్క రైతు వద్ద ఒక్క రూపాయి నేను తీసుకున్నట్లు నిరూపించినా దేనికైనా సిద్ధం అని చెప్పారు. మా అబ్బాయితో తిరిగే వాళ్లంతా గంజాయి బ్యాచ్ అనడం, వారిని కొట్టిలోపల వేయిస్తారని అంటుంటే ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుశాఖ పనిచేస్తుందా లేదా అని ప్రశ్నించారు. ఎంఎల్‌సీ ఎన్నికల సమయంలో మహిళల మధ్య వివాదం ఏర్పడితే దాంతో నాకేమిటి సంబంధం అని ప్రశ్నించారు. మీ తాత విగ్రహానికి అనుమతి నేను ఇప్పించకపోతే పెట్టేవారేనా ..అటువంటి మీరు నేడు వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం ఏమిటి అంటూ ప్రశ్నించారు. పుట్టుకతో జమిందారు అయినట్లు మాట్లాడడం, మేమేదో పాలేరు అన్నట్లుగా మాట్లాడడం సరికాదన్నారు. 1973లోనే సొంత కారు, ప్రస్తుతం మేము ఉన్న ఇల్లు 1977లోనే అద్భుతంగా కట్టారు అంటూ టీ.కృష్ణ సైతం మూడు సినిమాలు మా ఇంట్లోనే తీసిన విషయం తెలుసుకోవాలన్నారు.

కార్పొరేటర్లతో సమీక్షించానని, వారంతా తమ పార్టీలోనే ఉంటామని చెప్పారన్నారు. వారికి ఏదైనా సమస్య ఉంటే వారి సమస్యపై పోరాటం చేసేందుకు తాను అండగా ఉంటానని చెప్పానన్నారు. మహా అయితే ఇంకో రెండేళ్లు పాలన ఉంటుందని, ఈ నేపథ్యంలో విశ్వసనీయత కోల్పోతే తిరిగి రాజకీయ భవిష్యత్తును సంపాదించుకోవడం కష్టం అని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్, గంటా రామానాయుడు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, ఇనగంటి పిచ్చిరెడ్డి, షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొలిఏకాదశి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

ఒంగోలు సెంట్రల్: హిందువుల తొలిపండుగగా తొలి ఏకాదశికి ప్రత్యేక స్థానముంది. సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశులతో ఆషాఢ శుద్ధ ఏకాదశి నాటి నుంచి శ్రీ మహావిష్ణువు నాలుగు నెలల పాటు క్షీర సాగరంలో శేష తల్పంపై శయనిస్తాడు. ఈరోజున ఉపవాసం ఉండి జాగరణ చేసి శ్రీ మహావిష్ణువును పూజిస్తే విశేష ఫలితాలు కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి. జిల్లాలోని ప్రజలంతా తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, జాగరణ చేసి, శ్రీ మహా విష్ణువును పూజించి విశేష ఫలితాలు పొందాల్సిందిగా కోరుతూ తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలను మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాస రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్లమెంటరీ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

24 మండలాల్లో వర్షపాతం నమోదు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ఐదు రోజులుగా చెదురుమదురు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా 24 మండలాల్లో 180.4 మి.మీల మేర వర్షపాతం నమోదు కాగా, సరాసరిన 4.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అందులో కంభం 34.2 మి.మీ, రాచర్ల 21.2, బేస్తవారిపేట 17.8, దోర్నాల 13.8, గిద్దలూరు 12.4, దొనకొండ 12.0, తర్లుపాడు 11.2, హెచ్‌ఎంపాడు 9.0, పొదిలి 7.6, కొనకనమిట్ల 5.4. పెద్దారవీడు 5.2, వెలిగండ్ల 5.0, కొమరోలు 3.8, మార్కాపురం 3.6, పుల్లలచెరువు 2.6, ఎన్‌జీపాడు 2.4, కనిగిరి 2.0, దర్శి 1.4, మద్దిపాడు, ముండ్లమూరు, మర్రిపూడిలలో 1.2, కురిచేడు 1.0 మి.మీ వర్షపాతం నమోదైననట్లు అధికారులు పేర్కొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.362

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర మంగళవారం గరిష్టంగా రూ.362 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. పొదిలిలో అమ్మకాలు జరిగాయని, ఒంగోలు కేంద్రంలో చూర కొనుగోలు జరుగుతుందని ఆర్‌ఎం తెలిపారు. పొదిలి కేంద్రంలో 102వ రోజు వేలం పాటలో 137 బేళ్ల రాగా 639 బేళ్లను కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 98 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.362, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.312.93గా నమోదైంది. ఒంగోలులో చూర కొనుగోలు చేస్తున్నట్లు, అందులో 485 బేళ్ల రాగా అందులో 466 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయగా 19 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర రూ.150, కనిష్ట ధర రూ.60, సరాసరి రూ.90.45 వచ్చిందన్నారు.

మండల సమావేశానికి భారీ బందోబస్తు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నాయకుడు గోవిందు

యర్రగొండపాలెం: పుల్లలచెరువు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొంటున్నారన్న విషయం తెలుసుకున్న సీఐ రాములు నాయక్ తన సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీసులు, ప్రత్యేక పోలీసు దళాలతో ఎంపీడీఓ కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, విలేకరులను మాత్రమే సమావేశం ప్రాంగణంలోకి అనుమతించారు. పోలీసులు ఊహించినట్లే సమావేశం హాలులోకి ఐటీ వరం మహిళా ఎంపీటీసీ భర్త టీడీపీ నాయకుడు కోట్ల గోవింద్ ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. గమనించిన సీఐ అతన్ని లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అతనికి పోలీసుల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. గత సీపీ ప్రభుత్వ కాలంలో ఎంపీటీసీ, సర్పంచ్‌ల భర్తలు సమావేశంలో పాల్గొనేవారమని, తమ ప్రభుత్వం వచ్చిన తరువాత తనను లోపలికి ఎందుకు వెళ్లనివ్వరని ఆయన వీరంగం సృష్టించాడు. దీంతో మండల పరిషత్ కార్యాలయం ముందు ఆయా ప్రాంతాల్లోని నాయకులు, కార్యకర్తలు, పోలీసులు గుంపులుగా చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో గట్టిగా కేకలు వినిపిస్తుండటంతో బయట ఏం జరుగుతుందో అన్న ఆందోళనతో సమావేశంలో ఉన్నవారంతా ఒక్కసారిగా లేచి నిలబడ్డారు. సీఐ జోక్యం చేసుకొని టీడీపీ నాయకుడికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించడంతో సమావేశం సజావుగా సాగింది.

ఆర్మీ జవాన్ ఇంట్లో చోరీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొంగలవీడు రోడ్డు బ్రహ్మంగారి గుడి సమీపంలో ఉన్న ఆర్మీ జవాన్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుంటూరి సురేష్ ఆర్మీలో పనిచేస్తుంటాడు. అతడి భార్య సుప్రజ ఇద్దరు పిల్లలతో కలిసి గిద్దలూరులో నివాసం ఉంటుంది. రెండు రోజుల క్రితం వారి బంధువుల వద్దకు వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి 2 జతల కమ్మలు, ఉంగరాలు, కాళ్ల పట్టీలు అపహరణకు గురైనట్లు సుప్రజ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భూ సేకరణ వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



భూ సేకరణపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రకాశంభవనంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ రికార్డ్స్ అధికారులతో జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ పురోగతి, 22ఏ డిలీషన్స్, సీసీఆర్‌సీ కార్డుల జారీ, మీ కోసం అర్జీల పరిష్కారం, మీసేవ, సచివాలయాల సర్వీసులు, కోర్టు కేసులు తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో మ్యుటేషన్, రీసర్వే, వెబ్‌ల్యాండ్‌లో పేరు నమోదు ఇతర భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. పరిష్కారం చేయలేనివి ఎందుకు చేయలేకపోతున్నది ప్రజలకు స్పష్టంగా తెలియచేయాలన్నారు. నిర్దిష్టమైన కారణం లేకుండా ఏ ఒక్క దరఖాస్తు తిరస్కరించకూడదన్నారు. రహదారులు, రైల్వే లైను కోసం చేపట్టిన భూసేకరణ పూర్తయిందో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. 22ఏ డిలీషన్లు నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ క్లెయిమ్‌లు రీ వెరిఫికేషన్ ప్రక్రియలో రెవెన్యూ, అటవీ, ఐటీడీఏ అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి చేయాలన్నారు. కోర్టు కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్‌ఓ విశ్వేశ్వరరావు, ఒంగోలు, కనిగిరి ఆర్‌డీఓలు సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, ఎస్‌డీసీలు ఝాన్సీలక్ష్మి, వరకుమార్, లోకేశ్వరరావు, డీఎఫ్‌ఓ శ్రీనివాసులు, డీటీడబ్ల్యూ జగన్నాథరావు, సర్వే అధికారి కిషోర్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

- ప్రయాణికులు సురక్షితం



కొప్పోలు ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదం దృశ్యం

ఒంగోలు టౌన్: కొప్పోలు రోడ్డులో మరో ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. పోలీసుల కథనం ప్రకారం.. నగర శివారులోని కొప్పోలు ఫ్లైఓవర్ సమీపంలోని పోతురాజు కాలువ దగ్గర మంగళవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో గుంటూరు నుంచి నెల్లూరు వెళుతున్న ట్రావెల్ బస్సు ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టింది. ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతింది. బస్సులో మంచి నిద్రలో ఉన్న ప్రయాణికులు ఉలిక్కిపడి లేచి భయంతో కేకలు వేశారు. ప్రమాదంలో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 ద్వారా ఒంగోలు జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో అటు ఇటు హైవేపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో రంగంలోకి దిగిన రక్షక మొబైల్ నేషనల్ హైవే సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేశారు. లారీ డ్రైవర్ పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ రంగం అభివృద్ధికి నాబార్డు కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం జిల్లా సహకార శాఖ, కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు, నాబార్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాలు పటిష్టంగా, లాభసాటిగా నడిచేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై పవర్‌పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి బి.శ్రీనివాసరెడ్డి, నాబార్డు డీడీఎం రవికుమార్, పీడీసీసీ బ్యాంకు సీఈఓ కోటిరెడ్డి, డీసీఓ రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాలంక క్షేత్రానికి తరలిస్తున్న మద్యం పట్టివేత

- పర్యావరణ పరిరక్షణ రుసుం రూ.50వేలు వసూలు
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధం



మద్యం సీసాలను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

యర్రగొండపాలెం: తొలిఏకాదశి పండుగ సందర్భంగా పాలంక పుణ్యక్షేత్రంలో జరిగే తిరుణాళ్లకు వెళ్లే వారిపై అటవీశాఖాధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. పలుప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ట్రాక్టర్‌లో తరలిస్తున్న 10 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పాలంకకు వెళ్లే భక్తులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, లగేజీ సంచులు, వాటర్ పాకెట్స్, బిస్కెట్ పాకెట్‌లు అనుమతించడం లేదని, పెద్ద పులుల అభయారణ్యంలో మద్యపానం, ధూమపానం, వంట వండటం, రాత్రిళ్లు బసచేయడం లాంటివి నిషేధించామని పెద్దదోర్నాల సబ్ డీఎఫ్‌ఓ వేణు తెలిపారు. పాలంకకు వెళ్లే వాహనాలను తనిఖీ చేయడంతో పాటు మోటారు బైకులకు రూ.200, జీప్‌లకు రూ.800ల ప్రకారం ఇప్పటి వరకు రూ.50వేలు పర్యావరణ పరిరక్షణ రుసుం వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయా ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద మార్కాపురం శిక్షణ డీఎఫ్‌ఓ శివకుమార్, రేంజ్ అధికారి సుబ్బారావు, డీఆర్‌ఓలు ప్రసాదరెడ్డి, నరసింహరావు, రామ్మోహనరావు, నాగరాజు పర్యవేక్షిస్తున్నారు.

టీడీపీ మద్దతుతోనే కేంద్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు

ఒంగోలు టౌన్: టీడీపీ మద్దతుతోనే కేంద్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం పరిపాలన చేస్తోందని, కార్మికుల హక్కులు కాలరాసేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. నగరంలోని కాపు కళ్యాణ మండపంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 6వ మహాసభలు మంగళవారం నిర్వహించారు. ఈ సభలకు యూనియన్ నగర నాయకులు కే.గోపి, సామ్రాజ్యం, కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలకులు పరిపాలిస్తున్నారని చెప్పారు. ఆప్కాస్‌లో వేలాది మంది తక్కువ వేతనాలకే పనులు చేస్తూ బతుకు బండి పెట్టుకొస్తున్నారన్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో ఆప్కాస్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఎన్డీఏ పాలకులు ఉద్యోగులు, కార్మికులు, రైతుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. కొత్త కార్మిక చట్టాలు రద్దు చేయాలని, ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడం ఆపాలని, కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, గంటనపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రత్న కుమారి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సభలో జిల్లా, నగర నాయకులు బి.దివ్య, భారతి పద్మ, తంబి శ్రీనివాసరావు, ఎస్డీ హుసేన్, సముద్రాల వెంకటేశ్వర్లు, బంకా సుబ్బారావు, కొర్నిపాటి శ్రీనివాసరావు, దామా శ్రీనివాసరావు, జి.రమేష్, డి.సుబ్బారావు, అక్కేశ్వరరావు, ఎం బాబు, ఏ రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల తొలగింపు సరైంది కాదు

- అధికారులు రాజకీయాలు వీడి విధులు నిర్వహించండి
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: అధికార పార్టీకి చెందిన నాయకుల మెప్పు పొందేందుకు తాత్కాలిక ఉద్యోగులపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువెళ్లి వారిని తొలగించడం సరైన పద్ధతి కాదని, రాజకీయాలు చేసేందుకు మేం ఉన్నామని, అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. పుల్లలచెరువు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంగళవారం ఆయన ముఖ్యఅతిథి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలు లేకున్నా అధికారులు తమ కింద పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పాఠశాలల్లో వంటలక్కలు, స్వీపర్లను తొలగించి ఎటువంటి పేరెంట్స్ తీర్మానం లేకుండా ఆయా ప్రాంతాలకు చెందిన నాయకుల సిఫార్సు చేసిన వారికి విధులను అప్పచెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 2014 తరువాత టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆయా శాఖల్లో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏ ఒక్కరినీ తొలగించలేదన్నారు. కానీ ఇప్పుడు వారితో బలవంతంగా రాజీనామాలు చేయిస్తే వారు ఏ విధంగా జీవించాలని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు ఇదో వ్యాపారంగా పెట్టుకున్నారని, తాత్కాలిక ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అనేక ప్రాంతాల్లో డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు వ్యవస్థను వ్యవస్థలాగా నడిపించాలని, నాయకుల మెప్పు పొందడానికి విధులు నిర్వర్తించే వారిని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా తమ పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని ఆయా ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రజాప్రతినిధులకు తమ ప్రాంత సమస్యలు పరిష్కరించుకునేందుకు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంచి వేదిక అని, సమావేశానికి వచ్చే ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను అర్జీ రూపంలో రాసుకొని వచ్చి అధికారులతో చర్చించి వారికి అర్జీ ఇచ్చినట్లు రసీదు పొందితే తమ ప్రాంత సమస్య తక్షణమే పరిష్కారం అవుతుందన్నారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులను సర్పంచ్‌లు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తమై అందుకు తగిన చర్యలు చేపట్టే అధికారులకు సహకరించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పిల్లలు పౌష్టికాహార లోపంతో బలహీనంగా కనిపిస్తున్నారని వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలకు మంచి ఆహారం అందేలా ఐసీడీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీళ్ల తోలకం బిల్లులు నెలల తరబడి నిలిచిపోయాయని వాటిని విడుదల చేయించే బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపట్టకుండా గతంలో నీళ్లు సరఫరా చేస్తున్న ట్యాంకర్ల యజమానులను తొలగించి సర్పంచ్‌ల తీర్మానం లేకుండా కొత్తవారికి అవకాశం ఇవ్వడం వల్ల ప్రజలు నీటి కోసం అలమటించి పోతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలను ఇబ్బంది పెడితే మీరే ఇబ్బంది పడాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు. మండల సమావేశానికి ఎంపీపీ కందుల వెంకటయ్య అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ వాగ్యానాయక్, వైస్ ఎంపీపీ కోట్ల వెంకటమ్మ, ఎంపీటీసీ ఎల్ రాములు, సర్పంచ్ తమ్మినేని సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ విలియం, వివిధ శాఖల అధికారులు నిర్మలాదేవి, శ్రీకాంత్, లక్ష్మీనరసింహం, శ్రీనివాసరెడ్డి, నాగప్ప, సామ్యూల్ జాన్, పద్మావతి పాల్గొన్నారు.

అధికార పార్టీ ప్రోద్బలంతో అమూల్‌కి తాళాలు



తాళాలు వేసి ఉన్న అమూల్ పాల డెయిరీ

టంగుటూరు: అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో అమూల్ పాల డెయిరీకి తాళాలు వేసిన ఘటన మంగళవారం మండలంలోని ఆలకూరపాడు గ్రామంలో జరిగింది. గ్రామంలో 450 గేదెలు ఉన్నాయి. ఉదయం సాయంత్రం గరిష్టంగా 600 లీటర్ల పాలు వస్తాయి. గ్రామంలో సంగం, అమూల్, ఇతర ప్రైవేట్ పాల డెయిరీలు 2 ఉన్నాయి. గతంలో లీటరు రూ.40, రూ.50 పలికే పాల ధర వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లీటర్ రూ.75 అయింది. రైతులకు గిట్టుబాటు ధర లభించింది. గ్రామంలోని శెట్టిగారి పచ్చిశెట్టి రామారావు కుమారుడు శ్రీను జ్ఞాపకార్థం కట్టించిన భవనంలో రైతు భరోసా కేంద్రం, మత్స్యశాఖ కార్యకలాపాలు ఇక్కడే నిర్వహించేవారు. ఈ భవనంలోనే అమూల్ పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆలకూరపాడు కార్యదర్శి సాంబయ్య అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో అమూల్ డెయిరీ కేంద్రానికి తాళాలు వేశాడు. తాళాలు వేయాలంటే గ్రామ రైతులు తీర్మానం చేయాలి. వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు లింగారెడ్డి సురేంద్ర రెడ్డి తాళాలు పగులకొట్టి పాల సేకరణ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.



ఎస్పీ సుమిత్ సునీల్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

మీ సహకారం మరవలేను

- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లా పోలీసు యంత్రాంగం, ప్రజలు ఇచ్చిన సహకారాన్ని ఎన్నటికీ మరవలేనని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. పోలీసులు, ప్రజలు సంపూర్ణంగా సహకరించడం వల్లే ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించగలిగామని చెప్పారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, బందోబస్తులను సమర్థవంతంగా నిర్వహించారని, హోం గార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ వరకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. బదిలీపై జిల్లా నుంచి వెళుతున్నా ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా తన పరిధిలో సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి సవాళ్లు ఎదురైనా ధీటుగా అధిగమించాలని, అంకితభావం, నిబద్ధతతో మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించాలని సూచించారు. కొత్త చట్టాలపై పూర్తిగా అవగాహన కల్పించుకొని ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించాలని చెప్పారు. ఎన్నికల సమయంలో విధి నిర్వహణలో ఎస్పీ ఇచ్చిన సూచనలు, సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని పలువురు పోలీసు సిబ్బంది కొనియాడారు. తమకు అండగా నిలిచి మానసిక స్థైర్యాన్ని నింపారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీపీఓ ఏఓ సులోచన, డీఎస్పీలు కిశోర్‌బాబు, రామరాజు, అశోక్‌వర్ధన్, బాలసుందరం, పోలీస్ లీగల్ అడ్వైజర్ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాక్టివిటీస్‌ను ముమ్మరం చేయాలి



మాట్లాడుతున్న డీఈవో డి.సుభద్ర

ఒంగోలు: జిల్లాలో ఎంపిక చేసిన 20 పాఠశాలల్లో కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర తెలిపారు. స్థానిక సమగ్రశిక్ష సమావేశ మందిరంలో కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నిర్వహించే ప్రధానోపాధ్యాయులకు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని 8 నుంచి 12వ తరగతి వరకు మైకెరీర్‌షో యాప్ ద్వారా ఆన్‌లైన్ యాక్టివిటీస్‌ను నిర్వహించాలన్నారు. దీనివల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని, భవిష్యత్తులో బాగా రాణిస్తారన్నారు. హైస్కూలు ప్లస్ అడ్మిషన్లు, ప్రగతి గురించి సమీక్షించి అడ్మిషన్ల పెంపుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఏడీ ఉదయ భాస్కర్, ఏఎంవో రమేష్, రిసోర్సు పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.